


మెల్లగా కళ్ళు విప్పాడు భరత్.

ఎక్కడో పైనున్న చిన్ని వెంటిలేటర్ లోంచి వెలుగు కిరణాలు అతనిని తాకుతున్నాయి. ఒంటిమీద పెద్ద బరువు మోస్తున్నట్టుగా... భారంగా ఉం దతనికి.

బాధగా మూలుగుతూ ఒక పక్కకి ఒత్తిగిల్లాడు.

దూరంగా తను తినకుండా వదిలేసిన అన్నం పళ్లెం కనిపించింది.

ఆ సిల్వరు పళ్లెంలోని అన్నం మెతుకుల కోసం చీమలు బారులు తీశాయి.

ఒకదాని వెనుక ఒకటి చేరి, సుశిక్షితులైన సైనికుల్లాగ క్రమబద్ధంగా అన్నం మెతుకుల్ని ముక్కున కరుచుకుని పోతున్నాయి.

ఆ దృశ్యం చూస్తుంటే-

ఆహారం కోసం తన ముందు క్యూలో నిలబడ్డ వరద బాధితులే రూపు కట్టారు భరత్‌కి.

కొన ప్రాణాలతో... మృత్యువుని జయించినా ఆకలిని జయించలేక క్యూలో నిలబడ్డ పీడితులే చీమల బారు స్థానంలో కనిపించారు.

భరత్ ఆలోచిస్తున్నాడు. ఒంటిమీద కనపడని పోలీసు దెబ్బలు అతన్ని కదలనివ్వకుండా చేసినా, అతని ఆలోచనలు మాత్రం స్వేచ్ఛగా సాగుతున్నాయి. గత వారం రోజులుగా జరిగినదంతా మనసులో మంట పెట్టినట్టు రగులుతోంది.

నిజానికి క్రూర మృగాల్లాంటి ఆ మనుషుల్ని ఎదిరించినందుకే తన కివాళ జైల్లో తెల్లవారింది!

వారం క్రితం-

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం యుద్ధప్రాతిపదికపైన వరద సహాయ కార్యక్రమాల కోసం తన బృందంతో అక్కడ అడుగుపెట్టాడు భరత్.

భరత్ బృందం ఆ ఊరు చేరుకునేసరికే- అంతా అయిపోయింది. ఊరు మునిగిపోయింది.

అక్కడి ప్రజలంతా వరద తాకిడికి కకావికలైపోయి ఉన్నారు. చెట్లమీద... పుట్లమీదా... ఇళ్ల కప్పుల మీదా చేరి ప్రాణ భయంతో వణికిపోతున్న జనాన్ని సముదాయించి, వాళ్లని పడవల్లోకి ఎక్కించి ప్రవాహానికి ఎదురీది మానవ జాతి తరఫున ప్రకృతితో యుద్ధం చెయ్యడం ఇంకా కళ్ల ముందు జరుగుతున్నట్లే ఉంది భరత్‌కి.

ఉబ్బిపోయి, గుర్తించడానికి కూడా లేకుండా నీళ్లలో తేలుతున్న శవాల్ని అభినవ విక్రమార్కుల్లాగ భుజాలమీద వేసుకు తిరిగిన భయంకర అనుభవం అతన్ని వెంటాడుతూనే ఉంది.

హెలికాప్టర్ల మించి కన్నీళ్లు కార్చి నాయకులు నాలు గైదు రోజుల పాటు ఆకాశం మీంచి నష్టాల్ని అంచనా వేశారు. ఆహారపు పొట్లాలని శూన్యంలోంచి కిందికి పారేశారు.

అక్కడితో నాయకుల బాధ్యత తీరిపోయింది.

కానీ - భరత్ బృందానికి అప్పట్నుంచి బాధ్యత

పెరిగింది. బాధితుల్ని శిబిరాల్లోకి చేర్చడం... వైద్య సహాయం అందించడం లాంటి కార్యక్రమాలు మొదలయ్యాయి.

సహాయం అందుకోడం కోసం బాధితులు క్యూలో నిలబడ్డారు.

ఇళ్ళు మిగిలిన వాళ్ళు.. మొండిగోడల్లా మిగిలిన వాళ్ళు దీనంగా ఆహారం కోసం క్యూలో నిలబడ్డారు.

నిజానికి వాళ్ళలో బిడ్డల్ని పోగొట్టుకున్న దుఃఖం లేదు.

భర్తల్ని దూరం చేసుకున్న విలాపం లేదు.

కన్నీళ్ళు లేవు.

చెట్టుకీ పుట్టకీ విడిపోయిన భావన లేదు.

అసలు వాళ్ళకి దుఃఖపడే శక్తి లేదు.

వైరాగ్యం నిండిన కళ్ళతో నిలబడ్డారు వాళ్ళు.

వాళ్ళతో పాటు...

గుండ్రాళ్ళలా ఉన్న కొందరు వస్తాదులు కూడా క్యూలో నిలబడ్డారు!

కాటాకుస్తీ పోటీల్లో తొడ చరిచే పహిల్వానుల్లా ఉన్నారు వాళ్ళు. వా ళ్ళెందుకు క్యూలో నిలుచున్నట్టూ?

అందుకఒకణ్ణి తీవ్రంగా ప్రశ్నించాడు-

"ఏం కావాలి? ఏం పని నీ కిక్కడా?"

"సరపంచిగా రంపారండీ."

"ఏం అయనగారి మూ డంతస్తుల మేడ కూడా వరదలో కొట్టుకుపోయిందా? ఇంత జరిగితే - ఆ పెద్దమని షేడీ?"

"మా కయ్యేం తెల్లండీ! మిమ్మ ల్నోపాలి అరి దగ్గరకి రమ్మనమని సెప్పారండీ! ఈ సీటీ కూడా వొంపారండీ! తతిమ్మా యినయాలు రేత్రికి నూర్దా రన్నారండీ."

"రాస్కెల్! ముం దిక్కణ్ణుంచి కదులు! నాకు తీరిక లేదు, ఉన్నా రానని చెప్పు. ఊరు పెద్దగా ఇంత నష్టం జరిగినప్పుడు ఇంట్లో కూర్చోడం కాదు! మనిషైతే బయటకి రమ్మని చెప్పండి."

భరత్ ఆవేశంతో ఊగిపోయాడు. నిశ్శబ్దంగా... జనం భరత్ మానవత్వానికి చేతులు జోడించారు. వాళ్ళలో కొందరు వస్తాదుల్ని తరిమికొట్టారు.

•• •• ••

ఆ రాత్రిని భరత్ ఎప్పటికీ మర్చిపోలేడు.

ఒళ్ళు గగుర్పొడిచే దృశ్యాల్ని చూసిన ఆ రాత్రి అతని సున్నిత హృదయంలో పెద్ద గాయం.

ఆ రాత్రి... పదకొండు గంటల సమయం. వరద బాధితులు శిబిరాల్లో ఉలిక్కిపడుతూ... భయంగా... అపనమ్మకంగా... తప్పనిసరిగా నిద్రని ఆశ్రయిస్తున్నారు.

పొద్దుట్నుంచీ... ప్రకృతి బేతాళుడు చెప్పిన భయంకర విషాద కథకి తలలు పగలకుండా సమాధానం చెప్పిన భరత్ బృందం గాఢ నిద్రలో ఉన్నారు.

భరత్‌కి మాత్రం నిద్ర పట్టడంలేదు. అసహనంగా... అటూ ఇటూ పక్కమీద దొర్లుతున్నాడు. మెదడు దొలిచేసే ఆలోచనలతో... ఇక నిద్ర పట్టదనే నిశ్చయించుకుని, అసహనంగా టార్చ్ అందుకుని బయటికి నడిచాడు.

ఆ ప్రాంతమంతా శవాల వాసన.




ఆ మర్నాడు సామూహిక దహనాల కోసం గుట్టలుగా పేర్చిన శవాలు కుళ్ళి మానవత్వం కంపు కొడుతున్నాయి.

అక్కడ పేర్చిన శవాలన్నీ కలిపి - బతికున్న రాజకీయ నాయకుడి ఉని కంత దుర్గంధం వెలువరిస్తున్నాయి.

వల్లకాడైపోయిన ఊళ్ళో... హరిశ్చంద్రుడి లాంటి భరత్ కాటికాపరిలా తిరుగుతున్నాడు. టార్చ్‌లైట్‌తో చీకటిని చీలుస్తూ నడుస్తున్నా డతను.

దూరంగా... ఆ చీకట్లో ఏవో ఆకారాలు వికృతంగా కదులుతున్నాయి. భరత్ అటుకేసి అడుగు లేశాడు. టార్చ్ వెలుగులో అటు తేరిపార చూసి అవాక్కయిపోయాడు.

అట్లాంటి దృశ్యాలు చూడాల్సి వచ్చినందుకు అతను సిగ్గుతో చచ్చిపోయాడు. గొంతు తడారిపోయింది. మాట పెగల్టం కష్ట మయ్యింది.

అయినా - "ఎవరదీ?" అంటూ అరిచాడు. అతని అరుపు అతనికే వినిపించలేదు.

పొద్దుట బియ్యం కోసం వరద బాధితులతో క్యూలో నుంచున్న మృగాల్లాంటి మనుషులు...

వాళ్ళే...

ఆ చీకట్లో...

మర్నాడు దహనం చెయ్యాల్సిన శవాల శరీరాల నుంచి వస్తువులు పెరుక్కుపోతున్నారు! చనిపోయిన ఆడవాళ్ళ మెడల నుంచీ... చేతుల్నుంచీ... చంటిపిల్లల మొలల నుంచి పైశాచికంగా వొలుచుకుపోతున్నారు!

ఆ దృశ్యాన్ని భరించలేక గొంతు చిరిగిపోయేలా అరిచాడు - "అరేయ్! అగండ్రా! ఏమి టా పనీ" అంటూ శక్తికొద్దీ వెంటపడ్డాడు.

మనుషుల రూపంలో ఉన్న పిశాచాలు చీకట్లోకి ఇట్టే మాయమైపోయాయి.

భరత్ హృదయం భగ్గుమంది.

జరుగుతున్న సంఘటన లేవీ ఆలోచనలకు అందటం లేదు.

ఏవి టిదీ? ఎక్క డుంది లోపం? ఇలా ఎందుకు జరుగుతోంది? చివరికి ఏమైపోతుం దీ ప్రపంచం? - లాంటి వెర్రి ప్రశ్నలతో ఆలోచన్లతో అతనికి పిచ్చెక్కిపోయింది.

"ఛీ! ఇట్లాంటి దృశ్యాలు చూస్తూ ఊరుకోలేను! గాది బలిసిన వాళ్ళకి దోచిపెట్టలేను! ఈ రాబందుల్ని సహించలేను."

భరత్ ఆవేశం కట్టలు తెంచుకుంది. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి అతన్ని వెక్కిరించింది.


అవును. కేవలం... ఆలోచన... వివేచన... ఉంటే చాలదు. దాన్ని అమలుచేసే సత్తా కావాలి! ఆశయాల్ని ప్రతిపాదిస్తే సరిపోదు. వాటిని నిలబెట్టుకునే చేవ కావాలి!


అవినీతి చేసేవాడికి మాత్రం దాన్ని కాపాడుకునే మార్గం ఉంది!

ఆ ఊరిని ప్రళయ భీకరంగా ముంచేసిన ఉప్పెనలాగ... నీతిని అవినీతి ముంచేసింది! ఆ వరదలో భరత్ కొట్టుకుపోయాడు.

అతనికి జైల్లో తెల్లవారింది. అతను చేసిన త ప్పేమిటీ?

బాధితుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన సహాయాన్ని భరత్ దోచుకున్నాడని ఆరోపణ! ●





దొంగతనానికి ఆ ఊరి సర్పంచి ప్రథమ సాక్షి!
ఆ నిజం ఒప్పించేందుకు... లాఠీ!
ఆదమరిచి నిద్రపోతున్న ఆ ఊరిని ఉప్పెన ముంచిపారేసింది. మెలకువగా ఉన్న భరత్‌ని... అతని నీతిని... అవినీతి... మింగేసింది!
భరత్ ఆలోచిస్తున్నాడు. ఇంకా అదే పాత ప్రశ్న వేసుకుంటున్నాడు. "ఎక్కడుం దీ లోపం?" అని.
దూరంగా క్రమశిక్షణతో చీమలు అన్నం మెతుకుల్ని ముక్కున కరుచుకుంటూ పాకుతున్నాయి. భరత్ వాటినే తదేకంగా చూస్తున్నాడు. అంతలో లాకప్ గది ఇనప తలుపులు తెరుచుకున్నాయి. బూట్లు టకటక లాడిస్తూ, లాఠీని తమాషాగా గాల్లో తిప్పుతూ... నవ్వుతూ ఎస్సై భరత్ దగ్గరికి వచ్చాడు.
అలా వచ్చినప్పుడు ఎస్సై బూటు కాలికి తగిలి అన్నం వళ్లెం దూరంగా బోర్లా పడింది.
భరత్ ఎస్సై కళ్లలోకి చూశాడు.
ఎస్సై తన గడ్డాన్ని బొటనవేలితో రాస్తూ, నవ్వాడు.
"ఎందు కొచ్చిన గొడవా? ను వ్వేం పోటుగాడివా? ఆ సర్పంచిని ఎదిరించగలవా? నిన్ను ఇలా తీసుకొచ్చి స్టేషన్‌లో వడేస్తే - మీ బృందంలో ఒక్కడైనా ముందు కొచ్చాడా? నీతి అనేది పెద్ద బూతు మాట! తెలిసిందా?" బూటు నేలమీద కొడుతూ లెక్చర్ దంచాడు ఎస్సై.
"అయితే - నీ ఉద్దేశ్యం ఏవిటీ?" తీక్షణంగా ప్రశ్నించాడు భరత్.
"మేం చెప్పినట్టు వింటే ఇంటి కెడతావు భద్రంగా! లేకపోతే మా వరదలో కొట్టుకుపోతావు! ఊచ లెక్కపెడతావు. ఉద్యోగం ఊడి ముష్టెత్తుకుంటావు! ఆలోచించుకో! నీ కేం కావాలో తేల్చుకో!"
వినురుగా అక్కణ్నుంచి వెళ్లిపోయాడు ఎస్సై.
లాకప్ తలుపు మూసుకుపోయింది.
నిస్సహాయంగా... నీరసంగా కళ్లు మూసుకున్నాడు భరత్. అతని ముందు అవినీతి సవాలు విసిరింది.
తను దానికి సమాధానం చెప్పి తీరాలి.
మెల్లగా కళ్లు తెరిచాడు భరత్.
అతనికి కొన్త దూరంగా కనిపించిన దృశ్యం చూసి... వణికిపోయాడు.
అక్కడ అప్పటికే...
అంతదాకా బారులు తీసిన చీమలు చచ్చిపోయాయి.
చీమల బారు చెల్లా చెదరైపోయింది.
తిరగబడిన అన్నం వళ్లెం చుట్టూ చీమల శవాలు!
కొన్ని చీమలు నేలకి అంటుకుపోయాయి.
కొన్ని ఎస్సై కాలి బూట్లకి అంటుకుపోయి ఉంటాయి.
కొన్ని చీమలు క్షతగాత్రులైనాయి.
అయినా సరే-
కుంటుతూ కుంటుతూ కదిలించగలిగినంత మేర శరీరాల్ని కదిలిస్తున్నా యవి.
క్షణంలో ముంచుకొచ్చిన మృత్యు పదఘట్టనల విషాదఛాయలో చీమలు తల్లడిల్లిపోలేదు.
చెల్లాచెద రైన సమూహం...
కొద్ది నిముషాల్లో ఏక మయ్యింది.
భరత్ వాటినే దీక్షగా చూస్తున్నాడు.
అంతకుముందు ఆహారం కోసం ఎలా బారులు తీరాయో ఇప్పుడు చనిపోయిన తమ సహచరుల శవాల్ని కూడా... అట్లాగే ముక్కున కరచి మోసుకెడుతున్నాయి!
శవాల చేతి వేళ్లనుంచి వస్తువులు పెరుక్కున్న మనుషులు జ్ఞాపకాని కొచ్చి ఒళ్లు ఝల్లుమంది భరత్‌కి. అతని మనసు వణికిపోయింది.
అతని కళ్లనుండి అసంకల్పితంగా రెండు కన్నీటి బొట్లు చీమల శవాలపైన రాలాయి.
శరీరం కన్నా మెదడు ఎక్కువ ఉన్న చీమలకి నమస్కరించి - అవినీతిపైన యుద్ధానికే సిద్ధమయ్యాడు - భరత్! ★

బేలూరు శిల్పాలు

